



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ సృజన

కర్నూలుకు న్యాయ రాజధాని ఎక్కడ

- బిజెపికి మద్దతు ఇచ్చే పార్టీలను ఓడించాలి - పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల

- కర్నూలు లో భారీ గా ఘన స్వాగతం - ఉమ్మడి కర్నూలు జిల్లా కాంగ్రెస్ నాయకులతో సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలుకు న్యాయ రాజధాని ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎక్కడ ఏర్పాటు చేశారని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల ప్రశ్నించారు. హంద్రీనీవా ప్రాజెక్టు పనులు పూర్తి చేయడం లో జగనన్న, చంద్రబాబు మోసం చేసారని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కర్నూలు వెంకటరమణ కాలనీ తనిష్ పంక్షన్ హాల్లో ఉమ్మడి కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు కె.బాబు రావు, లక్ష్మి నర్సింహ అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా వైఎస్ షర్మిల, సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి, జెడి శీలం, సీనియర్ నేతలు కెవిపి రామచంద్రరావు, మాజీ పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్ర రాజు, మాజీ మంత్రి శైలజనాథ్, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు ఓటేస్తే బిజెపికి ఓటేసినట్లేనని అన్నారు. రాష్ట్రాన్ని 10 సంవత్సరాల పాటు బిజెపినే పాలించిందని పేర్కొన్నారు. ఇసుక,లిక్కర్, మాఫియాలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అడ్డగోలుగా అవినీతికి పాల్పడుతుందన్నారు. రాజశేఖర్ రెడ్డి రాజ్యం తీసుకుని వస్తానని చెప్పిన జగన్ మోహన్‌రెడ్డి అందుకు విరుద్ధంగా పాలన చేస్తున్నారని విమర్శించారు. జగనన్న చంద్రబాబులను ప్రజలు మరోసారి నమ్మి మోసపోకుండా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపైన ఉందన్నారు. ఈ రెండు పార్టీలు అనుసరిస్తున్న విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. పోలింగు బూత్‌స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. మస్తాన్‌వలి మాజీ మంత్రి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబులు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రజావ్యతిరేక విధానాలని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయని బిజెపి పార్టీని కూడా బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షులు షర్మిల



బాణం ఎక్కు పెడుతున్న షర్మిల

వైఎస్. షర్మిలకు ఘనంగా స్వాగతం

కడప జిల్లా నుండి నేరుగా కర్నూలు జిల్లాకు వచ్చిన వైఎస్ షర్మిలకు ఓర్వకల్లు మండలంలోని నన్నూరు గ్రామ సమీపంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. బాబురావు, లక్ష్మీనరసింహ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలికారు. అనంతరం టోల్గేట్ నుండి నంద్యాల చెక్‌పోస్టు మీదుగా సి.క్యాంప్ సెంటర్, రాజ్ విహార్ సెంటర్ నుండి నేరుగా ఫంక్షన్ హాల్‌కు బైక్ ర్యాలీతో వచ్చారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారందరికీ వైఎస్ షర్మిల కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు దామోదరం రాధాకృష్ణ, జాన్ విల్సన్, దేవిశెట్టి ప్రకాష్, బతుకన్న ఆయా నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

జిలానీ బాష ప్రత్యేక ఆకర్షణ : గాయత్రి హాస్పిల్ యజమాని జిలాని బాష వైఎస్.షర్మిలకు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. జిలానిబాష కార్యకర్తలతో బాణసంచా పేల్చుతూ కాంగ్రెస్ జెండాలు, ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఆస్పత్రి సిబ్బంది, స్థానిక కార్యకర్తలు వందలాంది పాల్గొన్నారు. అనంతరం వైఎస్.షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

సిబ్బంది వివరాలు నమోదు చేయాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల సిబ్బంది వివరాలను వెంటనే కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నమోదు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో 'స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను కలెక్టర్ సృజన, జెసి నారపురెడ్డి మౌర్యతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడారు. స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు నాణ్యతగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్జీదారుడికి తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇచ్చి అర్జీదారుడికి అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. డిఆర్‌ఒ కె.మధుసూదన్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, నాగప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1న మెగా జాబ్ మేళా

ఫిబ్రవరి 1న కర్నూలు సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కలెక్టర్ సృజన తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఉద్యోగ మేళా గోడపత్రికలను కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జెసి నారపురెడ్డి మౌర్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మెగా జాబ్ మేళాలో భాగంగా వివిధ రకాల 18 ప్రయివేట్ కంపెనీల్లో 2,200 ఖాళీలను భర్తీ చేయనున్నటుల తెలిపారు. కర్నూలు నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో ఫిబ్రవరి 1న ఉదయం 9.30 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాబ్ మేళాలకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా కోఆర్డినేటర్ సృజన్ 8374231357 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. డిఆర్‌ఒ కె.మధుసూదన్ రావు, డిఆర్‌డిఎ పీడీ సలీం బాష, ఉపాధి కల్పన అధికారి దీప్తి, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ అధికారి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల కల్పన

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల కల్పనను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఈఆర్‌ఒలు, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎస్ఇలతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలోని 2,186 పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులుగా గుర్తించిన విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్, ర్యాంప్, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ర్యాంప్, టాయిలెట్స్ పనులు కచ్చితంగా మొదలై ఉండాలన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో కూడా మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుందని తెలిపారు. వారం రోజుల్లోపు వీటిని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ అంశంపై ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలతో మంగళవారం సమీక్ష నిర్వహిస్తామన్నారు. రాయలసీమ యూనివర్సిటీలో అన్ని స్ట్రాంగ్ రూములకు కొంత మేరకు గోడలు పగులగొట్టి, ప్లాస్టరింగ్ చేయాల్సి ఉందని తెలిపారు. కౌంటింగ్ హాళ్లకు బారికేడ్స్ చేయాల్సి ఉందని, ఈ పనులు మొదలు పెట్టాలని సంబంధిత నోడల్ అధికారులను ఆదేశించారు. అలాగే ఇంటర్మీడియరీ డిస్పాచ్ సెంటర్లను కూడా సిద్ధం చేసుకోవాలని సూచించారు.

కర్నూలులో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

- కమిషనర్‌కు డివైఎఫ్ఐ, ఐద్వా వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో పెరిగిన జనాభా, ట్రాఫిక్‌కు అనుగుణంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించి, రోడ్ల విస్తరణ చేయాలని సోమవారం కర్నూలు మున్సిపల్ కమిషనర్‌కు డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాల నాయకులు స్పందనలో వినతిపత్రాన్ని అందజేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు, డివైఎఫ్ఐనగర కార్యదర్శి ఎస్.హుస్సేన్‌బాష మాట్లాడుతు కర్నూలు నగరం రోజురోజుకు విస్తరిస్తుందన్నారు. పెరుగుతున్న నగర జనాభాతో పాటు ట్రాఫిక్ కూడా విపరీతంగా పెరిగిపోయిందన్నారు. పెరిగిన ట్రాఫిక్ కారణంగా నగరంలో చాలా ప్రాంతాల్లో వాహనాలు స్తంభించిపోతున్నాయని తెలిపారు. తర్వాత యధాస్థితి రావడానికి చాలా సమయం పడుతుందన్నారు. దీంతో నగర ప్రజానీకం చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాబట్టి మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకొని ట్రాఫిక్ నియంత్రణ కోసం ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించి, ముఖ్యమైన ప్రాంతాలలో రోడ్ల విస్తరణ చేసే విధంగా కృషి చేయాలని, దీనిపై కమిషనర్ ప్రత్యేకంగా చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఐద్వా జిల్లా నాయకులు కెఎస్.పద్మ, పిఎస్. సుజాత, డివైఎఫ్ఐ నాయకులు వీరేష్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దోమల నివారణ చేపట్టకపోతే

నగరపాలక సంస్థను దిగ్బంధిస్తాం

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో దోమల నివారణ చేపట్టకపోతే నగరపాలక సంస్థను దిగ్బంధిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి డిగౌస్‌దేశాయి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల హెచ్చరించారు. దోమల నివారణ చేపట్టాలని కోరుతూ సోమవారం సిపిఎం నగర కమిటీల ఆధ్వర్యంలో నగర పాలకు సంస్థ కార్యాలయం ముందు గంటసేపు బైఠాయించారు. ఎంతసేపటికీ అధికారులు బయటకు రాకపోవడంతో ప్రజలు లోపలి గేటు వరకు వెళ్లి 'కమిషనర్ బయటకు రావాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయి, నిర్మల మాట్లాడారు. దోమలు ప్రజలపై స్వైర విహారం చేస్తుంటే అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ, తూతూమంత్రంగా చర్యలు చేపడుతున్నారని విమర్శించారు. ఖానా ఖజానాపై ఉన్న శ్రద్ధ ప్రజల ఇబ్బందులపై లేదని ఎద్దేవా చేశారు. గత 40 ఏళ్ల చరిత్రలో ప్రజలు నిద్రాహారాలు మానుకునేలా చేశారని తెలిపారు. ప్రజలు రాత్రిపూట ఎలా నిద్రపోవాలో, రోజూ జాగరణ చేయాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. ఎవరికి చెప్పినా నగరపాలక సంస్థలో వినే నాథుడే కరువయ్యారని, ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితిని నగర ప్రజలు ఎన్నడూ ఎరగరని తెలిపారు. పత్రికల్లో వివిధ రూపాల్లో వార్తలు వచ్చినప్పుడు మాత్రం తూతూ మంత్రంగా దోమల నివారణ మందు పిచికారి చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. నగరంలో దోమలు ఎందుకు ఇంత విపరీతంగా పెరుగుతున్నాయి, ఎక్కడి నుంచి వస్తున్నాయి, వాటి నివారణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలని కనీస ఆలోచన కూడా అధికారులకు లేకపోవడం బాధాకరమని మండిపడ్డారు. నగర పాలక సంస్థ అధికారులకు చెత్త పన్ను, ఇంటి పన్ను వసూలుపై ఉన్న శ్రద్ధ నగర ప్రజలను ఆరోగ్యకరంగా ఉంచడంలో లేదని తెలిపారు. నగరపాలక సంస్థ అధికారులు తీరు ఇలా ఉంటే పాలకమండలి తీరు ఇంకా దుర్మార్గంగా ఉందని విమర్శించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేటర్లు, మేయర్ అధికార పార్టీకి చెందిన వారే అయినప్పటికీ ఓట్లు, సీట్లపైన ఉన్న శ్రద్ధ నగర ప్రజల ఆరోగ్యాల పట్ల శ్రద్ధ లేదని మండిపడ్డారు. వీరందరూ ఏం చేస్తున్నారని ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. కమిషనర్ బయటకు వచ్చి సమాధానం చెప్పాలని పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో బయటకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. హంద్రీ, కెసి కెనాల్‌లో చెత్తాచెదారాన్ని తక్షణమే తొలగించి నీటిని శుభ్రం చేసి, దోమల గుడ్డు చనిపోయేలా మందులను పిచికారి చేయాలని కమిషనర్‌ను కోరారు. హైపో ద్రావణాన్ని వదలాలని, నగరంలో వివిధ ప్రాంతాల్లో నీరు నిలిచిన చోట హైపోబాల్స్‌ను వదలాలని, తుంగభద్ర నదిలో దోమలు ఉత్పత్తి కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నగరంలో పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచి రోజువారీగా మురుగు కాలువలను శుభ్రం చేయాలని కోరారు. అలాగే ప్రతి వార్డులోనూ రోజూ వాకింగ్ మిషన్ ద్వారా పొగను వదలాలని డిమాండ్ చేశారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ.. వివిధ శాఖలతో సమన్వయం చేసుకొని దోమల నివారణకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సిపిఎం జిల్లా నాయకులు రాధాకృష్ణ, ఆనంద్ బాబు మాట్లాడారు. సిపిఎం జిల్లా నాయకులు అలివేలమ్మ, గురు శేఖర్, నగేష్, సిపిఎం నగర నాయకులు సుధాకరప్ప, సాయి బాబా, నరసింహులు, విజయ్, షరీఫ్, అబ్దుల్లా, రామకృష్ణ, వివిధ ప్రాంతాల్లోని ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



నగర పాలక సంస్థ ముందు బైఠాయించి నాయకులు

స్పందనలో తెగని టిట్కో గృహాల సమస్య

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో గృహాల సమస్య పరిష్కారం కాక నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా ఎవరు అక్కడ పోయి కాపురం చేయలేని పరిస్థితి ఉందని లబ్ధిదారులు వాపోతున్నారు. సోమవారం కర్నూలు మునిసిపల్ హాలులో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ ప్రజల నుండి అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో ప్రధానంగా కర్నూలుకు చెందిన మునీర్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ నిర్ణీత రుసుముగా రూ.లక్ష చెల్లించాలని, ఇంతకు టిడ్కో ఇల్లు కేటాఇంచలేదని, టిడ్కో గృహంలో ఏదైనా ఒకటి కేటాయించాలని కోరారు. కొత్తపేటకు చెందిన ఉస్మేబీ, ఛత్రిబాగ్‌కు చెందిన మహేశ్వరీ మాట్లాడుతూ మాకు ఇల్లు లేదని టిడ్కో గృహాలలో ఏదైనా ఒక ఇల్లు కేటాయించాలని కోరారు. స్పందనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శశిలత, ఎంహెచ్ఒ డాక్టర్ కె. విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్న రాముడు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ప్రేమ నగర్‌కు చెందిన సుజాత , ఇతరులు తమ వీధి యందు సరియైన డ్రెయినేజీ వ్యవస్థ, సిసిరోడ్డు లేనందున, తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, కావున వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు. సంతోష్ నగర్‌కు చెందిన మౌలా , ఇతరులు తమ వీధిలో సరియైన డ్రెయినేజీ వ్యవస్థ , సి.సి.రోడ్డు లేనందున, తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నామని చెప్పారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ , సిబ్బంది

ఫ్లోరోసిస్‌పై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

ప్రతి ఒక్కరూ ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ జి.సుధాకర్ అన్నారు. సోమవారం కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామములోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించినారు. ఆయన మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. తాగడానికి వంట తయారు చేయడానికి నీరు ముఖ్యం అన్నారు. నీటిలో మంచి సూక్ష్మ పోషకాలు ఉంటా యని, అవి తగినంత మోతాదులో నీటిలో ఉంటే మనకు సమస్యలు రావని, అవి తగినంత లేకుంటే ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. ఫ్లోరి సిస్ అనే వ్యాధి వలన దంతాల మీద అడ్డంగా పసుపు రంగు గీతాలు ఏర్పడతాయని, దంతాలు గోధుమ రంగులో మారుతాయని, చిగుళ్ళు నల్లగా మారుతాయని, పళ్ళు చాక్ పీస్ రంగులోకి మారుతాయని, దంతాలు గుంటలు గుంటలుగా ఏర్పడి దంతాలు పిప్పిపళ్ళుగా తయారవుతాయని తెలిపారు. మనం తినే ఆహారం సరిగా నమల లేకపోతామని, దీని వలన తలనొప్పి రావడం, దంతాలకు రంధ్రాలు పడడం వలన సరైన పోషకాహారం తీసుకోనలేరని అన్నారు. దీనివలన పోషకాహారలేమికి , అనేక వ్యాధులకు గురి అవుతారని తెలిపారు. దంత సమస్యల వలన ఇతరులతో కలవకపోవడం. మాట్లాడలేకపోవడం ఇలాంటి సమస్యలు ఏర్పడతాయని తెలిపారు. ఇలాంటివారు టూత్ పేస్ట్ ను బటాని గింజంత మోతాదులో తీసుకోవాలని సూచించారు. ఉదయం సాయంత్రం రెండు పూటలా బ్రష్ తో కడుక్కోవాలని తెలిపారు. ఆహారం తీసుకున్న తర్వాత నోటిని నీళ్లతో పుక్కిలించుకోవాలని, నీలువచేసిన జంక్ ఫుడ్ తినడం వలన ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. హై ఫ్లోరైడ్ టూత్ పేస్టు నిలువ ఉండే చిరుతిళ్లు, శీతల పానీయాలు, రెడీమేడ్ చిప్స్, ప్యాకేజులు ఆహార పదార్థాలలో అధికంగా ఫ్లోరైడ్ ఉంటుంద న్నారు. పాఠశాల ఉపాధ్యాయులు సురేష్ కుమార్ రెడ్డి, ఆరోగ్య సామాజిక అధికారి శిరీష, ఆశా కార్యకర్తలు ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి జిలాని బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గాయత్రి హాస్పిటల్ అధినేత జిలాని బాషా సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కర్నూలు నగరంలోని తనిష్క్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఎపి సిపిసిసి అధ్యక్షులు వైయస్ షర్మిల, జాతీయ నాయకులు కెవిపి రామచందర్‌రావు సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. జిలాని బాషాకు షర్మిల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



జిలానీ బాష ప్రత్యేక ఆకర్షణ : గాయత్రి హాస్పిల్ యజమాని జిలాని బాష వైఎస్.షర్మిలకు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. జిలానిబాష కార్యకర్తలతో బాణసంచా పేల్చుతూ కాంగ్రెస్ జెండాలు, ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఆస్పత్రి సిబ్బంది, స్థానిక కార్యకర్తలు వందలాంది పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మేనేజర్ చిన్నరాముడు

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి-కర్నూల్ కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఐదు క్రీడా విభాగాలలో, ఐదు స్థాయిలలో నిర్వహిస్తున్న ' ఆడుదాం ఆంధ్ర ' మెగా క్రీడా టోర్నమెంట్‌ను నగర పాలక సంస్థ మేనేజర్ చిన్న రాముడు ప్రారంభించారు. ఇందులో భాగంగా నగర పాలక సంస్థ పరిధిలో ఉత్సాహంగా జరుగుతున్న క్రీడా పోటీలలో చివరి అంకంగా, నియోజకవర్గ స్థాయి ఫైనల్ పోటీలు కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర పాలక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అలీ, స్పెషల్ ఆఫీసర్ మన్సూర్ , ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

తాండ్రపాడు నుండి గార్గేయపురం వరకు రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకష్ణ డిమాండ్ చేశారు. నూతనపల్లె గ్రామ రైతులు , జి.రామకృష్ణ, నాయకులు మధుసూదన్, తదితరులు కలెక్టర్ సృజన ను కలిసి రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం స్వీకరించిన కలెక్టర్ స్పందిస్తూ త్వరగా తేదీ నిర్ణయించి పర్యవేణ చేసి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జి.రామకృష్ణ మాట్లాడుతూ కోట్ల రూపాయలు విలువ చేసే భూమి కేవలం ఎకరాకు రూ.12 లక్షలు ఇవ్వడం దారుణమన్నారు. ఇది రైతులకు తీరని నష్టమని ఇక్కడి భూమి చాలా సారవంతమైనదన్నారు. రెండు కార్లు మూడు కార్లు పంటలు పండే భూములు ఉన్నాయన్నారు. ప్రతి పొలంలో బోర్లు ఉన్నాయన్నారు. అటువంటి భూములకు అతి తక్కువ నష్టపరిహారం ఇవ్వడం అన్యాయమని అన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు శేఖర్, రాముడు ,రామకృష్ణ, బాష తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి ఇస్తున్న రామకృష్ణ

1న టెన్త్ విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ మోడల్ ఎగ్జామ్

ప్రజాశక్తి-మద్దికేర

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న మద్దికేర మండలంలోని అన్ని పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కడవల రవికుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు పరీక్షా సమయం దగ్గరకు వస్తున్న కొద్ది చాలా ఒత్తిడికి గురి అవుతుంటారని, ఆ ఒత్తిడిని దూరం చేయడం కోసం, విద్యార్థిలు ఎంతవరకు చదువుకున్నారో తెలుసుకోవడం కోసం టెస్టులు పెడుతున్నట్లు తెలిపారు. అన్ని సబ్జెక్టులు కలిపి ఒకే ఎగ్జామ్ రాస్తున్నారని, ఎగ్జామ్‌లో అన్ని వన్ మార్క్ ప్రశ్నలు ఉంటాయన్నారు. పాలిసెట్ రాసే విద్యార్థులకు ఈఎగ్జామ్ చాలా ఉపయోగపడుతుందని అన్నారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థులు చదువు కోసం ముందుండి వారి ఎదుగుదలకు కృషి చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకొని మెయిన్ ఎగ్జామ్‌లో మంచి మార్కులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సెర్ప్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్ : సెర్ప్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లు రెగ్యులరైజేషన్ చేసి పేస్కెల్ అమలు చేయాలియని వైకెపి, డిఆర్‌డిఎ జెఎసి అధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. జెఎసి నాయకులు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల నుండి ప్రభుత్వానికి ఎన్నిసార్లు మా వినతి పత్రం ఇచ్చినా ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. సెర్ప్‌లో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల సిబ్బందిని రెగ్యులర్ చేసి లేదా క్యాడర్ నోఫికేషన్ చేసి పే స్కేల్ అమలు చేయలని డిమాండ్ చేశారు.

నగరపాలక సంస్థ కార్యాలయం నాసిరకం : పిపిఎస్ఎస్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నాసిరకం పనులపై కఠినమైన చర్యలు ఉంటాయని గతంలో నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ ప్రకటించినప్పటికీ మార్పు రావడం లేదు. ఇంజనీర్లలో కదిలిక కరువైందని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రూ.28 కోట్లతో నగరపాలక సంస్థ నూతన భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. చాలా సందర్భాల్లో నిర్మాణ పనులను పరిశీలిద్దామని వెళ్లిన ప్రతి సందర్భంలో సంబంధిత ఇంజనీర్లు అక్కడ ఏ ఒక్కరు కనిపించరని అన్నారు. ఇంజనీరు సూపర్ అంటే ఇంజనీర్ల నగరపాలక సంస్థ కార్యాలయం ఆఫీస్ కి వెళ్తే అక్కడ కనిపించరు? మరి ఎక్కడుంటున్నారు? ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారా? ఇంజనీర్ల కోసం ప్రయత్నించిన కొన్ని సందర్భాలను పరిశీలిస్తే అవుననే అనిపిస్తుందన్నారు. ఆఫీసు నిర్మాణ ప్రారంభంలో వేస్తున్న భీముల నిర్మాణం కోసం కింది భాగంలో వేసిన సిమెంట్ బెడ్ కంకర నెల తిరగక ముందే కంకర తేలిందన్నారు. టాక్టర్ రాకతో భీము కృంగిపోయి నెర్రెలు వచ్చిందన్నారు. ఈ పరిస్థితిని పక్కనే 100 మీటర్ల దూరంలో ఉండే ఇంజనీర్లు అటుపక్క తొంగి చూడలేదా? లేక కాంట్రాక్టర్లకు భయపడుతున్నారా? కాంట్రాక్టర్లు ఇచ్చే కాసులకు ప్రభావితమవుతున్నారా? వెంటనే కమిషనర్, సూపరిండెంట్ ఇంజనీరు జోక్యం చేసుకొని కాంట్రాక్టర్ తో పాటు సంబంధిత ఇంజనీర్లను పై చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టి ప్రజాధనాన్ని కాపాడాలన్నారు.



నాటకరంగం పెద్దదిక్కును కోల్పోయింది: పిఎన్ఎం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

ప్రముఖరంగ స్థల నటులు అల్లాబక్ష్ మృతితో నాటకరంగం పెద్దదిక్కును కోల్పోయిందని ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు ఎంపి. బసవరాజు, నాయకులు రాజు, లోకేష్ తదితరులు సంతాపం ప్రకటించారు. ఆయన నాటకరంగానికి విశేషకృషి చేసిన నాటకకర్తనే కాక ఆయనొక గొప్ప మానవతావాది అని అభివర్ణించారు. రాయలసీకు రంగస్థల రత్నం, హరిశ్చంద్ర పాత్రధారి ఎన్‌టిఆర్ అవార్డు గ్రహీత లొద్దిపల్లె అల్లాబక్ష్ అనేక పాత్రలు చేసి గత 50 సంవత్సరాలుగా కళారంగానికి కృషి చేసారు. హరిశ్చంద్రుడుగా బిళ్వమంగళ డుగా అనేకపాత్రలకు పెట్టింది పేరు. ఆయన మరణం కళారంగానికి తీరనిలోటని లలితకళాసమితి అధ్యక్షులు పత్తిఓబులయ్య, కార్యవర్గసభ్యులు సంతాపం ప్రకటించారు.





తహశీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

పంట నష్టపరిహారంపై శ్రద్ధ పెట్టండి

- తహశీల్దార్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి- దేవనకొండ

కరువు నేపథ్యంలో రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని, రైతులకు పంట నష్టపరిహారం ఇప్పించాలనే చిత్తశుద్ధి ప్రజాప్రతినిధులకు లేకపోగా సీట్ల కోసం, అధికారం కోసం పాకులాడుతున్నారని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ విమర్శించారు. సోమవారం రైతులతో కలిసి స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సిపిఎం మండల నాయకులు యూసుఫ్ బాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంటలు నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించినప్పటికీ రైతులకు పరిహారం చెల్లించలేదని, తక్షణమే పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.50 వేల పరిహారం వెంటనే రైతు ఖాతాలో జమ చేసి, బ్యాంకుల్లో రైతుల తీసుకున్న పంట రుణాలు మాఫీ చేయాలని కోరారు. గత టిడిపి ప్రభుత్వంలో కూడా 2018లో కరువు మండలంగా ప్రకటించినప్పటికీ పరిహారమందించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ ఏడాది కూడా ఎన్నికల నేపథ్యంలో అదే పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వలసల నేపథ్యంలో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందని, వెంటనే మండలంలో సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. వ్యకాస, రైతు సంఘం నాయకులు మహబూబ్ బాష, సూరి, బజారి, కెపి.రాముడు, నాగేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

రైతుల సౌకర్యార్థం ఎసి గోడౌన్ల నిర్మాణం

- కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ విజయ మనోహరి

ప్రజాశక్తి - హోళగుంద

రైతుల సౌకర్యార్థం ఎసి గోడౌన్ల నిర్మాణానికి కృషి చేస్తానని కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ విజయ మనోహరి తెలిపారు. సోమవారం హోళగుంద ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన భవనాన్ని ఆమె ప్రారంభించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ మల్లికార్జున చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నీలకంఠ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విజయ మనోహరి మాట్లాడారు. 1921న చిన్నగా ప్రారంభమైన ఈ సంఘం ఈరోజు పెద్ద వృక్షంలా మారి ప్రతి రైతుకూ రుణాల రూపంలో ఫలాలను ఇస్తూ ఉన్నత స్థితికి చేరిందని తెలిపారు. నేడు సొంత భవనం నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో రైతుల మేలు కోసం, రైతుల పంటలు పాడవకుండా ఉండేందుకు ఎసి గోడౌన్ల నిర్మాణం చేపట్టి ఆదుకుంటామని చెప్పారు. రైతులకు తమ బ్యాంకు ద్వారా త్వరలో బంగారుపై కూడా రుణాల అందించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలు పొందాలని సూచించారు. జడ్‌పి వైస్ ఛైర్మన్ బొజ్జమ్మ, పిఎసిఎస్ డైరెక్టర్లు సహారా భాను, బి.లక్ష్మి, కెడిసిసి మేనేజర్ ఆలూరు రవి ప్రకాష్, కర్నూలు డిసిఒ ఎన్.రామాంజనేయులు, కర్నూలు సిఇఒ పి.రామాంజనేయులు, జిఎం విజయకుమార్, సర్పంచి రంగమ్మ తనయుడు పంపాపతి, హోళగుంద ఎంపిపి నూర్జాన్‌బీ తనయుడు ఈసా, వైసిపి మండల కన్వీనర్ సెపుల్లా, ఎఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న విజయ మనోహరి

మతిభ్రమించి మాట్లాడిన చంద్రబాబు

- ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

అక్రమాలకు పాల్పడుతున్నామని తనపై, తన కుటుంబ సభ్యులపై చంద్రబాబు మతిభ్రమించి ఆరోపణలు చేస్తున్నారని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. కల్లు బావి వీధిలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదివారం పత్తికొండలో జరిగిన బహిరంగ సభలో లేనిపోని ఆరోపణలు చేయడం బాబు దిగజారుడు తనానికి నిదర్శమని విమర్శించారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి ఆడవారు అని కూడా చూడకుండా తమ కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. అక్రమాలకు కేరాఫ్‌గా చంద్రబాబు ఉండడం వల్లనే 54 రోజులు జైలులో ఉన్నారని, అలాంటి వ్యక్తి తమ కుటుంబానికి అవినీతి మరకలు అంటించడం శోచనీయమని తెలిపారు. దమ్ము, ధైర్యం ఉంటే ఆరోపణలు నిరూపించి చిత్తశుద్ధి చాటుకోవాలని సవాలు విసిరారు. పేదల కష్టాల్లో నుంచి పుట్టిన వైసిపి ప్రజా శ్రేయస్సు కోసమే పని చేస్తోందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జగన్మోహన్ రెడ్డిని 2024లో మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, వార్డు ఇన్‌ఛార్జీ మాధవరెడ్డి, వీరభద్ర రెడ్డి, రవి రెడ్డి, రేణుక, మంజుల, భాను, కౌన్సిలర్లు రాజేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ స్వామి, మల్లి, శ్రీలక్ష్మి, నల్లారెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, వైస్ ఛైర్మన్‌లు నరసింహులు, ఎంఎంజి.గౌస్, సర్దార్, నాగరాజు, సాయన్న, నారి, నాగేంద్ర, ముని, షేక్షావలీ, సుగుణమ్మ, గిరి, రవి రెడ్డి, ఎర్రి స్వామి, మస్తాన్, బాపురెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి



స్టాల్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గోనెగండ్లలో రైతు సదస్సు

- నమూనా స్టాల్స్ ప్రదర్శించిన వ్యవసాయ విద్యార్థులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని మండల పరిషత్ సమావేశ భవనంలో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాకు చెందిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం రైతు సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుజాత, ఎమ్మిగనూరు ఎడిఎ ఖాద్రీ హాజరయ్యారు. విద్యార్థులు తయారుచేసిన సమీకృత వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయం, హైడ్రోఫోనిక్స్ ద్వారా సాగునీటి కుంటలు, వర్షపు నీటిని ఆదా చేయడం తదితర అంశాలతో కూడిన స్టాల్స్‌ను బనవాసి కేంద్రం సమన్వయకర్త పరిశీలించారు. తయారు చేసిన నమూనాలపై వ్యవసాయ విద్యార్థులు అధికారులకు, రైతులకు వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ చందన, డాక్టర్ శ్రీదేవి, సహాయ ఆచార్యులు దివాకర్ రెడ్డి, ఎఒ హేమలత పాల్గొన్నారు.

సేవా పథకం ప్రత్యేక శిబిరం పరిశీలన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఆర్ట్స్, సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో మాలపల్లిలో జరుగుతున్న ఏడు రోజుల జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని రాయలసీమ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ గంధం సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ... కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అద్భుత రీతిలో క్యాంపులో పాల్గొంటూ ఆడపిల్ల చదువు, ఆరోగ్య పరిరక్షణ, నిరక్షరాస్యత నిర్మూలన, బహిరంగా మలవిసర్జన, వేప చెట్ల ఉపయోగం తదితర విషయాలపై అవగాహన కల్పించారని తెలిపారు. క్యాంపు నిర్వహణ తీరు పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ డేనియల్ ప్రేమ్ కుమార్ సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం పట్ల అవగాహన కల్పిస్తూ వాలంటీర్లకు తర్ఫీదునిచ్చారు. రసాయన ఎరువుల వాడకం ఆరోగ్యానికి మంచిదికాదని, సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయనికి ఎరువులు ఎలా తయారు చేయాలో వాలంటీర్లకు ప్రయోగాత్మక రీతిలో అగ్రికల్చరల్ డిపార్ట్‌మెంట్ అధికారి స్వామి తర్ఫీదునిచ్చారు. గ్రామాల్లో సచివాలయం సేవలు ఏ విధంగా పని చేస్తున్నాయనే విషయాన్ని పంచాయతీ సెక్రటరీ స్వామినాథ్ వివరించారు. హెచ్ఐవి/ఎయిడ్స్‌పై సంధ్య రాణి అవగాహన కల్పించారు. ఈ ప్రత్యక శిబిరాన్ని ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జోనాథన్ విక్లీఫ్ పర్యవేక్షించారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ అరుణ


స్పందనలో అర్జీల వెల్లువ

- అర్జీదారులు తృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

స్పందనలో అర్జీలు వెల్లువెత్తాయి. సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళితే పరిష్కారం అవుతాయని ఆయా ప్రాంతాల బాధితులు అర్జీలు ఇచ్చేందుకు క్యూ కట్టారు. అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందనలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. గోనెగండ్ల మండలానికి చెందిన సర్వే నెంబర్ 491లో తనకు 3.23 ఎకరాల భూమి ఉందని, ఆ భూమి ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు నమోదయిందని, విచారణ చేపట్టి తన పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాజేష్ కోరారు. తనకు వితంతు పింఛను, ఇంటి స్థలం మంజూరు చేయాలని ఆదోని పట్టణం అంబేద్కర్ నగర్‌కు చెందిన వెంకటలక్ష్మి కోరారు. తన భర్త హుస్సేన్ సాబ్ మే 2, 2009న మృతి చెందారని, తమకు అవగాహన లేకపోవడంతో మరణ ధ్రువీకరణ పత్రం తీసుకోలేదని, విచారణ చేపట్టి తన భర్త మరణ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని గోనెగండ్లకు చెందిన కటికే అక్బర్‌బీ కోరారు. సర్వే నెంబర్ 7సి/ఎ3లో 2 ఎకరాల భూమి కొనుగోలు ద్వారా సంక్రమించిందని, ప్రస్తుతం ఆ భూమి 1.50 ఎకరాలు అమ్మామని, మిగిలిన 0.50 సెంట్ల భూమి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని ఆదోని పట్టణం ఎస్‌కెడి కాలనీకి చెందిన రాజ శెట్టి కోరారు. పరిపాలన అధికారి గోవిందు సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, శ్రీనివాసులు, డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, డిఎల్‌పిఒ కార్యాలయ పరిపాలన అధికారి వీరభద్రప్ప, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఆర్‌టిఒ నాగేంద్ర, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చేతన్ ప్రియ, డిప్యూటీ తహశీల్దార్లు కౌసర్ భాను, పెద్దయ్య ఉన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

నేడు వైసిపి నాయకుల విస్తృత సమావేశం

- వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య

ప్రజాశక్తి - చిప్పగిరి



చిప్పగిరి బంబం స్వామి దర్గా ఆవరణలో మంగళవారం వైసిపి ప్రజాప్రతినిధులు. నాయకులు, కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా బి.విరుపాక్షిని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో పార్టీ అధిష్టానం సూచనల మేరకు మండలంలోని వైసిపికి చెందిన సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని కోరారు. వైసిపి ఇన్‌ఛార్జీ విరుపాక్షి, ఎంపిపి జూటూరు హేమలత కూడా హాజరవుతారన్నారు.

లొద్దిపల్లి అల్లా బక్ష్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

అల్లాబక్ష్ సత్య హరిచంద్ర పాత్ర ధరించి వేదికపై ప్రదర్శన జరిగిందంటే కన్నీరు కార్చని హృదయం ఉండదు. కళను కన్నీటితో ముడిపెట్టి అద్భుత ముగ్ధ మనోహర రూపంతో రంగస్థలంలో నటించిన గొప్పకళాకారుడు లొద్దిపల్లి అల్లా బక్ష్ అని కర్నూలు రంగస్థల కళాకారుల సంఘం సంతాపం ప్రకటించింది. ఉభయ ఆంధ్రప్రదేశ్ రంగస్థల కళాకారుల సత్య హరిచంద్ర పాత్ర అభిమాన నటులు లొద్దిపల్లి అల్లా బక్ష్ అభినయానికి స్పందించని హృదయం ఎవరూ ఉండరని కొనియాడారు. అల్లాబకాష్ అభినయానికి మెచ్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ అవార్డును ప్రదానం చేసిందని, వృత్తి రీత్యా ఉపాధ్యాయులుగా కొనసాగుతూ ప్రవృత్తి రీత్యా రంగస్థల కళాకారుడిగా కొనసాగుతూ రంగస్థల నాటకం పై గల మక్కువతో సత్యహరిచంద్ర పాత్రను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు 1500 వేదికలపై పోషించిన ఏకైక నట యశస్వి నటదిగ్గజమన్నారు. రాయలసీమ కళారత్నగా బిరుదుపొందిన లొద్దిపల్లి అల్లా బక్ష్ జిల్లా ప్రభుత్వ అధికారులు ఆయన నటనను వేదికపై చూసి కన్నీరు కార్చి శభాష్ అని పొగిడిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. సంతాపం ప్రకటించిన కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గుర్రపు శాల అంకయ్య, బైలుప్పల షఫీవుల్లా హనుమాన్ కళా సమితి అధ్యక్షులు పి.హనుమంతరావు చౌదరి, సయ్యద్ రోషన్ అలీ అజయ్ కుమార్, టిజివి కల్చరల్ అకాడమీ అధ్యక్షులు వివి.రమణారెడ్డి, కళావాహిని సాహితీ సంస్థ అధ్యక్షులు ఎం.మనోహర్ బాబు, రైతు కళానిలయం ఎం రామలింగం, శ్రీ గణేష్ కళానికేతన్ వివి రమణాచారి, విశ్వకళా సమితి అధ్యక్షులు ఎం.బీసన్న, కర్నూలు రంగస్థల కళాకారులు సిహెచ్ చంద్రన్న, కళాప్రియ తిరుపాలు, పి.దస్తగిరి, పుల్లయ్య అరుణ కుమారి రమణాచారి, ముంతాజ్ బేగం, రాజశేఖర్ రావు, రామకృష్ణ టీచర్, భాస్కర్ , టివి.రెడ్డి రాధిక ,శ్రీనివాసులు, విజయలక్ష్మి, నారాయణ, చిన్నికృష్ణ, షేక్షావలీ తదితరులు నివాళులర్పించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని మొలగవల్లి గ్రామంలో కర్ణాటక అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు. సోమవారం పోలీసు స్టేషన్ ఆవరణలో ఆయన మాట్లాడారు. మొలగవల్లి గ్రామ శివారులోని గడ్డివాములో కర్ణాటక అక్రమ మద్యం నిల్వ ఉంచారని తెలిపారు. సమాచారంతో సోదా చేయగా 11 బాక్సుల (టెట్రా ప్యాకెట్లు 90 ఎంఎల్) దొరికినట్లు చెప్పారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసి నిందితుని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. అక్రమంగా కర్ణాటక మద్యాన్ని ఎవరైనా అమ్మినా, తరలించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాంటి వారి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



మద్యాన్ని చూపుతున్న పోలీసులు

విచ్చలవిడిగా గుట్కా అమ్మకాలు...

- గుట్కాకు బానిసలై అనారోగ్యం పాలవుతున్న యువకులు - చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద మండలంలో గుట్కా ప్యాకెట్ల అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. గుట్కాకు బానిసలై యువకులు అనారోగ్యం పాలవుతున్నారు. గుట్కా ప్యాకెట్ల అమ్మకాలను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చేస్తున్నారు.

హోళగుంద నుంచి 5 కిలోమీటర్ల దూరంలో కర్ణాటక సరిహద్దు ఉండడంతో అధిక సంఖ్యలో గుట్కా ప్యాకెట్ల రవాణా జరుగుతున్నట్లు సమాచారం. ఇక్కడ ఏ దుకాణానికి వెళ్లినా తాగడానికి నీరు దొరుకుతుందో, లేదో కానీ గుట్కా ప్యాకెట్లు మాత్రం దర్శనమిస్తాయి. అధికారులకు తెలిసినా తూతూమంత్రంగా దాడులు నిర్వహించి అక్కడక్కడ 1, 2 కేసులు కట్టి చేతులు దులుపుకుంటున్నట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. గుట్కా ప్యాకెట్ల అమ్మకాల వల్ల వ్యాపారులకు అధిక సంఖ్యలో లాభాలు వస్తున్నా, ఎక్కువ శాతం కార్మికులు, యువకులతో పాటు యువతులు, మధ్య తరగతి మహిళలు సైతం బానిసైనట్లు తెలిసింది. నోటి క్యాన్సర్‌తోపాటు రక్తహీనత, మతిస్థిమితం కోల్పోవడం వంటి సమస్యలు వచ్చి చేరుతున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నా యువత పెడచెవిన పెడుతున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి 30 గుట్కా సీట్లు గల ఒక బాక్సను రూ.100 ప్రకారం కొనుగోలు చేసి రూ.150 నుంచి రూ.200 వరకు వ్యాపారులు అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.



రాష్ట్రాల మధ్య కఠిన చర్యల అమలులో తేడాలు

గుట్కా, మత్తు పదార్థాల కార్యకలాపాలపై కఠిన చర్యలు అమలు చేయడంలో రాష్ట్రాల మధ్య తేడాలు ఉండడం వల్ల గుట్కా, మత్తు పదార్థాల అమ్మకందారులు చెలరేగిపోతున్నట్లు సమాచారం. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆదాయమే ధ్యేయంగా పని చేయడం, ఒక రాష్ట్రం గుట్కా అమ్మకాలు చట్ట విరుద్ధం, నిషేధమంటూ ఆదేశాలు జారీ చేస్తున్నాయి. మరో రాష్ట్రం గుట్కా, మత్తు పదార్థాల వల్ల అధిక లాభాలు ఆర్జించవచ్చని భావించడం వల్ల యువతతో పాటు మహిళలు కూడా అనారోగ్యం పాలవుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

ఏ రాష్ట్రం కూడా గుట్కా, మత్తు పదార్థాలను అమ్మి లాభాలను ఆర్జించకూడదని కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. పక్కన కర్ణాటక రాష్ట్రంలో గుట్కా ప్యాకెట్లు అమ్ముకోవచ్చని ఆదేశించడం వల్ల బహిరంగంగా మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో గుట్కా, మత్తు పదార్థాలు నిషేధించడం వల్ల రహస్యంగా అమ్మకాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుట్కా వ్యాపారులపై ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



జయంతి వేడుకల్లో వడ్డెర కుల పెద్దలు

వడ్డెరలను ఎస్టీలుగా గుర్తించాలి

- వడ్డెర కుల పెద్దలు

- స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వం వడ్డెరలను ఎస్టీలుగా గుర్తించాలని వడ్డెర కుల పెద్దలు కౌతాళం రాము, వడ్డే నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని అఖిల వడ్డే ఓబన్న సేవా సమితి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నారులు కలశాలతో ముందు రాగా ప్రత్యేక వాహనంలో వడ్డే ఓబన్న చిత్ర పటాన్ని ఉంచి పాటలను డిజె సౌండ్ సిస్టమ్ ద్వారా ఆలపిస్తుండగా, యువత నృత్యాలు చేస్తూ, రాఘవేంద్ర సర్కిల్ మీదుగా గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. శ్రీసుశమీంద్రతీర్థ చిల్డ్రన్స్ పార్కు వరకు ర్యాలీ సాగింది. అనంతరం కొండాపురం వద్ద ఉన్న గోకులంలో వన భోజనాలు ఏర్పాటు చేశారు. వడ్డెరలను ఎస్టీలుగా గుర్తించే వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. శ్రీరాఘవేంద్ర వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వడ్డెరల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం వడ్డెర సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కృష్ణమూర్తి, నాగరాజు, బాలరాజు, చిన్న ఈరన్న, అంగడి ఈరన్న, నరసింహ, వెంకట రాజు, వీరేష్, రామకృష్ణ, రాకేష్ శివరాజ్‌ను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. వడ్డెరలు వర్ధిరాజులు, ధర్మయ్య, కప్పన్న (ఈరన్న), మాధవ్, విజయ్ కుమార్, జనార్ధన్, రాజు, నల్లారెడ్డి, కుపేంద్ర, రాజు, నాగరాజు, వీరేష్, పురుషోత్తం, రాజు, రాముడు పాల్గొన్నారు.

టిడిపి నాయకులకు సన్మానం

ప్రజాశక్తి-తుగ్గలి

మండల కేంద్రమైన తుగ్గలిలో శాలివాహన ఫెడరేషన్ మాజీ ఛైర్మన్ నాగేంద్ర టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు, టిడిపి పత్తికొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జీ శ్యాంబాబును సోమవారం తమ నివాసంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడారు. పత్తికొండ నియోజకవర్గంలో టిడిపి జెండాను ఎగుర వేయడానికి సాయశక్తులా కృషి చేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పార్టీ కోసం కష్టపడితే ముందు భవిష్యత్తు ఉంటుందని హామీ ఇచ్చారని అన్నారు. అందుకే పార్టీ కోసం అహర్నిశలు కష్టపడతామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. మాజీ జడ్‌పిటిసి వరలక్ష్మి, నాగేంద్ర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నాయకులను సన్మానిస్తున్న నాగేంద్ర

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

- టిడిపి పాణ్యం ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని టిడిపి పాణ్యం ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత రెడ్డి అన్నారు. సోమవారం పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం ఎన్.కొంతలపాడు గ్రామంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి, సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ గౌరు చరిత రెడ్డి ప్రజలకు వివరించారు. ఎన్. కొంతల పాడు గ్రామ నాయకులు శ్రీనివాసులు, మధుసూదన్ గౌడ్, వెంకటేశ్వర్లు, తిరుమలేశు, మండల అధ్యక్షుడు గోవింద్ రెడ్డి, పార్లమెంటు ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, మండల నాయకులు నన్నూరు విశ్వేశ్వర్ రెడ్డి, పాలకొలను సుధాకర్ రెడ్డి, అల్లబాబు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్, కల్లూరు అర్బన్ రవి, లొద్దిపల్లి గిడ్డయ్య, సోమయాజులపల్లి సంజీవ, నన్నూరు శంషుద్దీన్, సర్కార్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్.కొంతలపాడులో ఇంటింటి ప్రచారం చేస్తున్న గౌరు చరిత రెడ్డి

ప్రభాకర్ రెడ్డి వైసిపి నేత కాదు

- టిడిపి నాయకులను టిడిపిలోనే చేర్చుకోవడం విడ్డూరం

- వైసిపి నాయకులు మార్కెట్ యార్డు డైరెక్టర్ రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పత్తికొండలో జరిగిన టిడిపి 'రా.. కదలిరా' బహిరంగ సభలో కల్లూరు మండలం పుసులూరు గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ పల్లె ప్రభాకర్ రెడ్డిని టిడిపిలో చేర్చుకోవడం విడ్డూరంగా ఉందని వైసిపి నాయకులు, కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వై.రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం కల్లూరు అర్బన్ 26వ వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మి కాంతారెడ్డి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడారు. పల్లె ప్రభాకర్ రెడ్డి ఎప్పుడూ వైసిపి నాయకులు కాదని, ఆయన టిడిపి నాయకులని చెప్పారు. వైసిపి నుంచి టిడిపిలో చేరినట్టు ప్రకటించడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వైసిపి నాయకులు, 26వ వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మికాంతరెడ్డి, గోకులపాడు మధుసూదన్ రెడ్డి, లక్ష్మీపురం సత్యం రెడ్డి, మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

డిజిటల్ విద్య ఘనత జగన్‌దే

- వైసిపి మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

డిజిటల్ విద్యను అందు బాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదేనని వైసిపి మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వగరూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఆయన విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రతిభను కనబరచాలని కోరారు. గ్రామ ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న విశ్వనాథ్‌రెడ్డి





వినతులు స్వీకరిస్తున్న డిఆర్‌ఒ పుల్లయ్య

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

- తొలగించిన స్వచ్ఛభారత్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి
- సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, స్వచ్ఛభారత్ కార్మికులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం, జిల్లా సహాయ కార్యదర్శి వి.బాలవెంకట్‌లు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్మికులు నూనెపల్లె సెంటర్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులు గ్రామ పంచాయతీలలో వీధులను, మురికి కాలువలను శుభ్రం చేస్తూ, బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ, అంటువ్యాధులు వ్యాపించకుండా ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారని తెలిపారు. అధికారులకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేస్తూ పని చేస్తున్నారని చెప్పారు. అటువంటి స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు 12 నుండి 22 నెలల వరకు వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి 14, 15వ ఫైనాన్స్ నిధులు వచ్చినప్పుడు ఆరు నెలల వేతనాలు ఇవ్వమని సర్క్యులర్ ఇచ్చినప్పటికీ ఏ ఒక్క ఎంపిడిఒ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కేవలం ఒకటి రెండు నెలలు వేతనం మాత్రమే ఇచ్చారని తెలిపారు. మిగతా నెలల వేతనాలు కార్మికులు అడిగితే పనులు మానుకోండని బెదిరిస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులు చొరవ చూపి వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్వచ్ఛభారత్ కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్, గ్లౌజులు, చీపుర్లు, డ్రస్సులు, చెప్పులు, సబ్బులు, నూనె ఇవ్వాలని, చెత్త బండ్ల రిపేర్లు అధికారులే చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 680 జీవో ప్రకారం నెలకు రూ. 10 వేలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిపిఒ మంజుల వాణికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ నాయకులు దేవదాసు, త్యాగరాజు, నారాయణ, సుబ్బరాయుడు, హనుమంతు, శేఖర్, సామేలు, బాలన్న, మద్దిలేటి, స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా వినతులపై ప్రత్యేక దృష్టి

- జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రజా వినతులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాల్లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి ఆయన విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన విజ్ఞప్తులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. దరఖాస్తులన్నింటినీ విథిన్‌ఎస్ఎల్ఎలోగా ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్-ఎల్ఎలోకి వెళ్లకుండా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులను రెండు రోజుల్లో క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అగ్ని ప్రమాదంలో 2 గేదెలు, 40 కోళ్లు మృతి

- మరో 5 గేదెలకు, 3 ఎద్దులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని పందిర్లపల్లి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు సంభవించిన అగ్ని ప్రమాదంలో 2 గేదెలు, 40 కోళ్లు మృతి చెందాయి. మరో 5 గేదెలకు, 3 ఎద్దులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు బాల ఈశ్వరయ్య గుడిసెలో అర్ధరాత్రి రెండు గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించాయి. గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో 2 గేదెలు, 40 కోళ్లు అక్కడకక్కడే మృతి చెందగా, మరో 5 గేదెలు, 3 ఎద్దులు తీవ్రంగా గాయపడ్డాయి. దీంతో రైతుకు దాదాపు రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. సంఘటన జరిగే సమయంలో గ్రామస్తులు అక్కడికి చేరుకొని మంటలు ఆర్పి వేశారు. నష్టపోయిన రైతుకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వైఎస్ షర్మిలకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

కడప నుండి కర్నూల్‌కు వెళ్తున్న కాంగ్రెస్ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు ఆళ్లగడ్డలో పార్టీ నాయకులు సోమవారం ఘన స్వాగతం పలికారు. ఆళ్లగడ్డలో కొద్దిసేపు వైఎస్ షర్మిల కొద్దిసేపు ఆగారు. పిసిసి నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు బరగొడ్ల హుస్సేన్ భాషా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ గజమాలతో షర్మిలకు ఘన స్వాగతం పలికారు. షర్మిలను చూసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో జాతీయ రహదారిపైకి చేరుకున్నారు. ఈ సందర్భంగా షర్మిల ప్రజలకు, కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేశారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ ఎస్ఐలు వెంకట్ రెడ్డి, షేక్ నగినాలు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహ, బరుగొడ్ల హుస్సేన్ బాషా మాట్లాడుతూ వైఎస్ షర్మిలను విమర్శిస్తే సహించబోమన్నారు. ఒకప్పుడు ఆళ్లగడ్డ కాంగ్రెస్‌కు కంచుకోట అని, ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని, రాష్ట్రంలో ఆళ్లగడ్డలో కాంగ్రెస్ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలు కూడా ఒక్కసారి ఆలోచన చేసి కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిరివెళ్ల, రుద్రవరం మండలాల అధ్యక్షులు పసుపులేటి లక్ష్మీ నరసింహుడు, శ్రీనివాసులు యాదవ్, జిల్లా డిసిసి ఉపాధ్యక్షుడు మహబూబ్ బాషా, దొర్నిపాడు, చాగలమర్రి మండలాల అధ్యక్షులు నాగయ్య, పాపాజీ, సంజీవ కుమార్, కార్యకర్తలు నజీర్ భాష, హుస్సేన్, మాబాషా, శంకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, శివారెడ్డి, హుస్సేన్ రెడ్డి, నరసయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

పర్యాటకంగా బిల్వస్వర్గం గుహలు

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి
- బేతంచెర్ల మండలంలో బిల్వస్వర్గం గుహలు, ప్యాపిలి మండలంలో వాల్మీకి గుహలు ప్రారంభం



బిల్వస్వర్గం గుహలను ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల మండలంలోని కెకె కొట్టాల(కనుమ కింది కొట్టాల) గ్రామంలో రూ.2.5 కోట్లతో పర్యాటకంగా అభివృద్ధి చేసిన బిల్వస్వర్గం గుహలను ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మనంద రెడ్డిలు సోమవారం ప్రారభించారు. అనంతరం బిల్వస్వర్గం గుహల సమీపంలో ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌ను ప్రారంభించారు. అక్కడ కిచెన్, టాయిలెట్లు, డైనింగ్ ప్రాంతాలను సందర్శించారు. ఆ తర్వాత పర్యాటకులు, కేకే కొట్టాల గ్రామ ప్రజలతో కలిసి కాఫీ తాగారు. రోడ్డు లేక ఎవరూ రావడానికి ఇష్టపడని గ్రామాన్ని పర్యాటకులు సైతం వచ్చేలా గుహలను అభివృద్ధి చేసినందుకు గ్రామస్థులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గుహలకు సంబంధించి ఫోటోలతో ఒక పెద్ద హోర్డింగ్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా పర్యాటక శాఖ జిల్లా అధికారులను మంత్రి బుగ్గన ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి నుంచి సహజ సిద్ధంగా ఏర్పడిన గుహలను గుర్తించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. తేనెటీగలకు, అపరిశుభ్రతకు నివాసంగా ఉన్న ఎర్రజాల గుహలు ఇకపై పర్యాటకులను ఆకర్షిస్తాయని తెలిపారు. గుహలలో నడవడానికి వీలుగా ఫ్లోరింగ్, గుహలను లోతుగా చూసే వీలుగా మెట్లు, పర్యాటకులను ఆకర్షించే రంగురంగుల విద్యుత్ కాంతులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, టూరిజం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనలో అపశృతి - ఏఎస్ఐకి తీవ్ర గాయాలు

మంత్రి బుగ్గన పర్యటనలో అపశృతి చోటు చేసుకుంది. బందోబస్తుకు ఎఎస్ఐలు, కానిస్టేబుల్ మోటారు సైకిళ్లు రహదారి సరిగ్గా లేపోవడంతో అదుపు తప్పి కింద పడ్డారు. కింద పడిన ఏఎస్ఐ కృష్ణారెడ్డికి ఎడమ చేయి విరిగింది. మరో ఏఎస్ఐ ఫజులుల్లా, కానిస్టేబుల్ మహేంద్ర రెడ్డిలకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ఏఎస్ఐలను స్థానికులు బేతంచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

ప్యాపిలి మండలంలో వాల్మీకి గుహలు ప్రారంభం

53 మందికి వ్యవసాయ భూమి హక్కు పత్రాలు పంపిణీ

ప్యాపిలి : ప్యాపిలి మండలంలోని బోయవాండ్లపల్లి గ్రామంలో ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన వాల్మీకి గుహలను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.3 కోట్లతో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. అతి ప్రాచీన చరిత్ర కలిగి రామాయణంతో ముడిపడి ఉండటం ఈ గుహలకు అత్యంత ప్రాధాన్యత చేకూరిందన్నారు. రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి ఈ గుహలలో తపస్సు చేసినట్లు స్థానికులు చెప్పుకుంటారన్నారు. అనంతరం బోయవాండ్లపల్లి గ్రామ ప్రజలు 53 మందికి 108 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన హక్కు పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. అలాగే మండలంలో రాచవండ్లపల్లి గ్రామం వరకూ రూ.1.93 కోట్లతో నిర్మించిన రహదారిని ప్రారంభించారు. దానికి ముందు రాయలచెరువు రోడ్డు నుంచి పెద్దపాయి వరకూ రూ.44 లక్షలతో నిర్మించిన తారు రోడ్డును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పాదయాత్ర చేస్తూ పెద్దపాయికి చేరి అక్కడ పైలాన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, జడ్పిటిసి శ్రీరామ్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పోదొడ్డి కృష్ణమూర్తి, మల్లికార్జున రెడ్డి, బోరెడ్డి రాము, కృష్ణారెడ్డి, మస్తాన్ ఖాన్, సాగర్, ప్రవీణ్, విగ్గు, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి గుహలను ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన తదితరులు



తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే కాటసాని

వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె : తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర స్వామిని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి, శాసనసభ్యుడిగా తనను ప్రజలు మరోమారు ఆశీర్వదించాలని స్వామివారిని కోరుకున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వెంట వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్యప్రకాష్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు జిల్లెల్ల శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆర్కే రోజా రాక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి ఆర్కే రోజా నేడు మంగళవారం ఆళ్లగడ్డకు రానున్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ కళాశాల మైదానంలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియంను ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రా రెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ సభ్యులు గంగుల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి ఆర్కే రోజా ప్రారంభోత్సవము చేయనున్నారు. ఈ కార్యక్రమానికి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కూడా హాజరుకానున్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - అవుకు : అవుకు పట్టణంలోని గుర్రాలపేట వీధికి చెందిన లంకెల ప్రసాద్ (50) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలిసిన బలిజ సంఘం వైస్ ప్రెసిడెంట్ నీరుకట్టు కిట్టు లంకెల ప్రసాద్ మృతదేహానికి నివాళ్లులర్పించారు. వెంటనే కుటుంబాన్ని ఆదుకునేందుకు బలిజసంఘం తరపున రూ. 5 వేలు ఆర్థిక సహాయాన్ని మృతుడి కుమారుడు లంకెల వనప్పకు అందజేశారు. లంకెల ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం ట్రెజరీ జక్కా మధు, మండల జనరల్ సెక్రెటరీ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ గుర్రాల శివరాం తదితరులు మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న బలిజ సంఘం వైస్ ప్రెసిడెంట్ కిట్టు

సూర్యారావు సేవలు మరువలేనివి

- భగత్ సింగ్ లైబ్రరీ చైర్మన్ బి.శంకరయ్య

ప్రజాశక్తి - నంద్యాల

గోదావరి జిల్లా నుండి ఉద్యోగ రీత్యా నంద్యాల టెక్నెండ్ కేబుల్ ఫ్యాక్టరీకి వచ్చి సిఐటియులో కార్మిక నాయకుడిగా పని చేసిన సూర్యారావు 1970 దశకం నుండి చివరి శ్వాస వరకు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పని చేశారని భగత్ సింగ్ లైబ్రరీ చైర్మన్ బి.శంకరయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక భగత్ సింగ్ లైబ్రరీలో ట్రస్ట్ బోర్డు సభ్యులు రామకృష్ణ రెడ్డి అధ్యక్షతన మొదటి లైబ్రరీయన్ సూర్యారావు సంతాప సభ నిర్వహించారు. ఈ సదర్భంగా ట్రస్ట్ సభ్యులు తోట మద్దులు, మాదాల శ్రీనివాసులు, డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ కార్మికునిగా కార్మికుల సమస్యలపై పని చేయడంతో పాటు ఆయన భార్య, పిల్లలను ప్రోత్సహించి మహిళా సంఘం, విద్యార్థి సంఘాల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. అననుకూల పరిస్థితిలో ప్రజాశక్తి పత్రికను పార్టీ శాఖగా నిర్వహించాల్సిన సమయంలో ప్రజాశక్తి ఏజెంట్‌గా రెండు సంవత్సరాలు ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ పత్రిక నడిపారని తెలిపారు. భగత్ సింగ్ లైబ్రరీ నిర్మాణ పనుల నుండి లైబ్రరీ నిర్వహణకు వరకూ ఆయన అనేక సేవలందించారాని అన్నారు. అనంతరం ప్రజా కళాకారులు చిన్న బాలహుస్సేని, వీరసేన, రమణ, సుధాకర్‌లు సూర్యారావుపై పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లెక్చరర్ కృష్ణమూర్తి రాజు, రామరాజు, హుస్సేన్, విరసం జిల్లా అధ్యక్షులు ముర్తుజా, వెంకటేశ్వర్లు, శంషావలి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద దంపతులు ఆత్మహత్యాయత్నం

- కలెక్టర్ చెప్పినా తహశీల్దార్ స్పందించడం లేదు... : బాధిత వికలాంగుడు సుధాకర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'జిల్లా కలెక్టర్, ఎస్‌పి చెప్పినా ఆక్రమణదారుల నుండి తహశీల్దార్ నా భూమిని ఇప్పించడం లేదు.. నాకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యేశరణ్యం' అంటూ రుద్రవరం మండలం చిన్న కంబలూరు గ్రామానికి చెందిన వికలాంగుడు ఎన్.సుధాకర్ తన భార్య సులోచనతో కలిసి సోమవారం కలెక్టరేట్ వద్ద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకొని వారించారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ 2006లో తనకు గ్రామంలో మూడు ఎకరాల భూమి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అయితే గ్రామానికి చెందిన కొమ్ము నారాయణ, మానికింది నడిపి రామాంజనేయులు, మానుకింది బాల ఆంజనేయులు, మానుకింది వరలక్ష్మిలు నకిలీ పట్టాలు పుట్టించి కోర్టులో తన మీద కేసు వేశారని తెలిపారు. వారి దగ్గర నకిలీ పట్టాలు ఉన్నందున కోర్టుకు సమర్పించలేకపోవడంతో ఆ పొలం తనకు చెందినదేనని కోర్టు ఆర్డర్స్ ఇచ్చిందన్నారు. తన పొలం ఎంజాయ్మెంట్ పొజిషన్ ఆర్డర్స్ ఇవ్వాలని తహశీల్దార్ చుట్టూ సంవత్సరాల తరబడిగా తిరుగుతున్నా నకిలీ పట్టాలు పుట్టించిన వారికే కొమ్ముకాస్తూ వారి వైపే మాట్లాడుతూ, తనన్ను మానసికంగా 10 సంవత్సరాల నుంచి వేధిస్తున్నాడని కలెక్టర్‌ను 6 నెలల కిందట కలిసి వివరించానన్నాడు. కలెక్టర్, ఎస్పీలు పొజిషన్ ఆర్డర్స్ ఇవ్వాలని తహసీల్దార్‌కు ఉత్తర్వులు ఇచ్చినా తనకు పొలం చూపడం లేదన్నారు. తహశీల్దార్ ఆగడాలు తట్టుకోలేక గత్యంతరం లేక తాను, తన భార్య సులోచనా ఇద్దరం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్రాణానికి ఎప్పటికైనా ఏమైనా జరిగితే తన పొలం ఆక్రమణ చేసుకున్న వారు, సంబంధిత రెవెన్యూ అధికారులే కారణమన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి తన పొలాన్ని చూపించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించాడు.



వికలాంగుడు సుధాకర్ దంతుల నుంచి పెట్రోల్ బాటిల్ లాక్కుంటున్న పోలీసు

జగన్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధం : టిడిపి



మాట్లాడుతున్న ఎన్ఎండి ఫరూక్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వైసిపి దురాగతాలకు ప్రజా కోర్టులో శిక్షపడే సమయం ఆసన్నమైందని, జగన్‌ను ఓడించేదుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, టిడిపి నంద్యాల ఇంచార్జ్ ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని 1వ వార్డులో కౌన్సిలర్ పిచ్చిక నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర మాజీ కార్యదర్శులు వెదుర్ల రామచంద్రరావు, తులసి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, పట్టణ అధ్యక్షులు మనియర్ ఖలీల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ జగన్‌కు కౌంట్‌డౌన్ స్టార్ట్ అయిందన్నారు. జగన్ నియంతృత్వ ధోరణి వలన వైసిపి తరపున అభ్యర్థులు బరిలో దిగడానికి నిరకరిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ప్రజలు గ్రహించాలన్నారు. జగన్ అహంకారానికి, వైసిపి అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు రైతులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు అంతా సిద్ధమయ్యారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జనాబ్ బీ, టిడిపి నాయకులు మాబుగుల్లి మున్నా, సంజీవ, మల్లి, సుంకయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కోర్టులో వైసిపికి శిక్ష ఖాయం : మాజీ ఎమ్మెల్యే

అవుకు : త్వరలోనే జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి ప్రజా కోర్టులో శిక్షపడే సమయం ఆసన్నమైందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం అవుకు మండలం చెర్లోపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి టిడిపి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సిద్ధమంటూ జగన్ రెడ్డి వైసీపీ నాయకులు ప్రచారాలు చేస్తున్నారని, త్వరలోనే వారిని ఇంటికి పంపించేందుకు రాష్ట్ర ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఐవి పక్కీరా రెడ్డి, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే



సిఎం చిత్రపటానికి పాలాభిషేం చేస్తున్న దృశ్యం

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం : వైస్ చైర్మన్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడమే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఉదయం ఖుబ్బా వీధి సచివాలయం, మధ్యహ్నం పెద్దన్న వీధి సచివాలయ పరిధిలో వైఎస్ఆర్ ఆసరా నాలుగవ విడత సంబరాలు ఆళ్లగడ్డ మున్సిపల్ వైస్ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం మహిళా పక్షపాతి అని, మహిళల ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేసారని తెలిపారు. మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న శాసన సభ్యులు గంగుల బ్రిజేంద్రా రెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్ళీ ఎన్నుకోవాలని కోరారు. ఖుబ్బా వీధి సచివాలయానికి సంబంధించి 71 సంఘాలకు రూ. 58.96 లక్షలు, పెద్దన్న వీధి సచివాలయానికి సంబంధించి 51 సంఘాలకు రూ.45.87 లక్షలు మంజూరయ్యాయి. ఆనంతరం పొదుపు మహిళలు కేక్ కట్ చేసి సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ వరలక్ష్మి, మల్లేశ్వరి, పట్టణ సమాఖ్య అధ్యక్షులు బద్రి నాగేశ్వరమ్మ, మెప్మా సిఎంఎం శోభ, సిఓలు వెంకట సుబ్బయ్య, చంద్ర విద్యాసాగర్ పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో 'గురు రాజా' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నంద్యాల : నంద్యాల పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో ఉన్న గురురాజా స్కూల్ విద్యార్థులు కడప జిల్లాలో జరిగిన చెస్ పోటీలలో చరణ్ అండర్-15 విభాగంలో ద్వితీయ స్థానాన్ని, వెయ్యి రూపాయల క్యాష్ ప్రైజ్, మెడల్స్, ప్రశంస పత్రాలను కైవసం చేసుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణంలో చెస్ పోటీలలో విజేతలుగా నిలిచిన అజిత్ వర్మ, ఫణీంద్ర, రామ సురేంద్ర, అశ్వ సాకేత్ రెడ్డి, జగదీష్, శ్రీనిధిలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్, మెమోంటోలతో గురురాజ విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్బారావు పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

దోమల నివారణ చర్యలు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలో దోమలను నియంత్రించడానికి చర్యలు చేపట్టాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా పట్టణంలో దోమల నుంచి కుక్కల నుంచి ప్రజలను కాపాడాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావుకి సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణం చుట్టు పక్కల గుండ్ల కమ్మ వాగు, పీతిరి వాగులుతో పాటు పట్టణంలోని అన్ని వీధుల్లో డ్రైనేజీలలో, రోడ్లపై నిల్వ ఉన్న చెత్తాచెదారం పేరుకు పోయి మురికి నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు అక్కడ నివాసం చేస్తూ రాత్రి అయిందంటే ఆత్మకూరు పట్టణమంతా దోమల వ్యాపించి మనుషులను ఇంటి నుంచి బయటకు రానీయకుండా దాడి చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారని వీటిని అరికట్టడంలో మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని అన్నారు. వార్డులలో కాలువలను శుభ్రం చేయడంలో, కాలువలలో బ్లీచింగ్ పౌడర్ కానీ హైపో ద్రావణాన్ని పిచికారి చేయడంలో, అలాగే రాత్రిపూట ఫాంగింగ్ చేయడం లేదని పేర్కొన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొని వాగులలో, డ్రైనేజీ లలో రోడ్ల పై చెత్తను శుభ్రం చేసి కాలువలో హైపో ద్రావణం పిచికారి బ్లీచింగ్ చల్లడం ఫాంగింగ్ చేసి పట్టణ ప్రజలను అంటురోగాలు విష జ్వరాల బారిన పడకుండా కాపాడాలని కోరారు. అలాగే పట్టణంలో కుక్కల భారీ నుంచి ప్రజలను కాపాడాలని సిపిఎం నేతలు విన్నవించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ దోమలపై తగు చర్యలు తీసుకుంటామని, కుక్కలకు ఆపరేషన్ చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు షైక్ ఇస్మాయిల్, సురేంద్ర,దినేష్, నాయకులు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



శివ దీక్ష స్వీకరిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

పాణ్యం ఎమ్మెల్యే కాటసాని శివదీక్ష స్వీకరణ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం శివదీక్షను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సోమవారం తెల్లవారు జామున స్వీకరించారు. ఈ సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే మాట్లాడుతూ 1991 నుండి యాగంటి శివ దీక్షను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. తానే 1991లో స్వయంగా శివమాల ధరించి దీక్షలను ప్రారంభించానని, ఈ సంవత్సరంతో 33వ సారి శివదీక్షను స్వీకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ, వారి కుమారుడు, వైసిపి యువనేత కాటసాని శివనరసింహ రెడ్డి, ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థ కార్యదర్శి మల్కిరెడ్డి దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుత్తి నర్సింహులును సన్మానిస్తున్న అంగన్వాడీలు

గుత్తి నర్సింహులుకు సన్మానం

ప్రజాశక్తి - చాగలమర్రి

స్థానిక చాగలమ దేవాలయ ఆవరణంలో అంగన్వాడీ సంఘం నాయకులు చంద్రకళ వహీదా ఇందుమతిల ఆధ్వర్యంలో అంగన్వాడీలు సిఐటియు మండల అధ్యక్షులు గుత్తి నర్సింహులు, గ్రామపంచాయతీ కార్మికురాలు సునీతలను సోమ వారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుత్తి నరసింహులుకు పూలమాల వేసి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం వాళ్లు మాట్లాడుతూ నిరవధిక నిరసన దీక్షల సమయంలో గుత్తి నర్సింహులు, సునీతలు తమకు అన్ని రకాల సహాయ సహ కారాలు అందిస్తూ పలు ప్రజా సంఘాల మద్దతును కూడగట్టి తమకు సంఘీభావం తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో హసీనా, సుజాత, గురమ్మ, జ్యోతివివిధ గ్రామాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

31న చలో విజయవాడ : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - పగిడ్యాల



కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

మాదిగల ఏబిసిడి వర్గీకరణ కోసం ఈ నెల 31న చలో విజయవాడకు మాదిగలందరూ ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షులు విజయుడు కోరారు. సోమవారం మండల కేంద్రం పగిడ్యాలలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయుడు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ తక్షణమే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో మాదిగ ఉపకులాలకు 21 ఎమ్మెల్యే సీట్లను, నాలుగు పార్లమెంటు సీట్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు చట్టసభల్లో సమన్వయం చేయాలన్నారు. ఈనెల 31న విజయవాడ గ్రౌండ్లో జరుగు యుద్ధభేరి మహాసభకు మాదిగలు ఉప కులాలు తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దేవదాసు, ఆనందరావు, రాజేష్, నాగరత్నం, సుందర్ రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషితోనే

వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పూర్తి

- ప్రారంభోత్సవంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి
- నాటి పరిస్థితులు తలచుకొని భావోద్వేగం
- ఎమ్మెల్యే అపర భగీరథుడు : ఎంపీ పోచా
- మంత్రి బుగ్గన కృషి అద్వితీయం : జడ్పీ చైర్మన్



సభలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రూ. 351 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు నిర్మించి రూ.45 వేల కుటుంబాలకు తాగునీరు అందించడం నా ఒక్కడి కృషి కాదు.. నియోజకవర్గ ప్రజలందరి కృషితో సాధ్యం అయ్యిందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మండలంలోని బుగ్గానిపల్లి తండా సమీపంలో నిర్మించిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి, జడ్పిటిసి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలతో కలిసి సోమవారం స్విచ్ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో బేతంచెర్ల మేజర్ పంచాయతీకి తాను సర్పంచ్‌గా ఉన్నప్పుడు ప్రజల దాహార్తి తీర్చేందుకు ముచ్చట్ల ప్రాంతంలో పైప్‌లైన్‌లు మరమ్మతులకు గురైనపుడు రాత్రంతా మేల్కొని చేయించిన సందర్భాలనేకం ఉన్నాయని అన్నారు. నాటి పరిస్థితులు, మహిళలు పిల్లల్ని తీసుకుని వచ్చి నీళ్లిప్పించమన్నపుడు నిస్సహాయత గురించి మంత్రి బుగ్గన గుర్తుచేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. బేతంచెర్ల మండలానికి 32 కి.మీ. దూరంలో ఉన్న గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీరు తెచ్చి 3 లక్షల మందికి తాగునీరివ్వడం డోన్ నియోజకవర్గ ప్రజల విజయం అని కొనియాడారు. కనుమ కింద కొట్టాల, కొత్త బురుజు, కౌలుపల్లె, వంకమిట్ట పల్లె, గుట్టల పల్లె లాంటి చివరి ఊళ్లకు కూడా తాగునీరిస్తున్నామన్నారు. 30 సంవత్సరాలుగా ఏ ఎమ్మెల్యే వెళ్లని గుట్టలపల్లెకు సైతం కొత్త రోడ్డు నిర్మించామన్నారు. మద్దిలేటి స్వామి క్షేత్రాన్ని రూ.50 కోట్లతో, ముచ్చట్ల మల్లికార్జున స్వామి, గుండాల చెన్నకేశవ స్వామి, పాలుట్ల రంగనాథ స్వామి, కంబగిరి స్వామి ఆలయాలను రూ.30కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు అమ్మఒడి, సామాజిక పింఛన్లు, వసతి దీవెన, విద్యాదీవెన, ఇళ్ల పట్టాలను కులమతాలకతీతంగా అందిస్తూనే మరొవైపు అభివృద్ధి పనులను ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతిపక్ష నేతలు తనపై అసత్యాలు ప్రచారం చేస్తూ సాధ్యం కాని హామీలను ఇస్తున్నారని అన్నారు. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును ప్రసాదించిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గానికి తాగునీరు ఇచ్చిన మంత్రి బుగ్గన అపర భగీరథుడని కొనియాడారు. రూ.25 కోట్ల ఎంపీ నిధులను ఎలాంటి మంచి పనుల కోసం ఖర్చు చేయాలా అని ఆలోచిస్తున్నానని, మంత్రి బుగ్గన మాత్రం రూ.2,500 కోట్లతో అభివృద్ధి చేయడం అంటే ఊహకు అందడం లేదన్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ గతంలో తాగు, సాగునీరు వసతి లేని డోన్ నియోజకవర్గానికి తాగునీరు తేవడంలో మంత్రి బుగ్గన కృషి అద్వితీయం అన్నారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల ఎంపీపీ నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, శ్రీ మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామ చంద్రుడు, గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, సిమెంట్ నగర్ సర్పంచ్ యాకోబు, బుగ్గానిపల్లె తాండ సర్పంచ్ వెంకటేష్ నాయక్, మేఘా సంస్థ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి, వాసు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్, కాంప్లెక్స్‌ను ప్రారంభం

బేతంచెర్ల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఆధునికరించిన పోలీస్ స్టేషన్, కాంప్లెక్స్‌ను సీఐ ప్రియతమరెడ్డి, ఎస్సై శివ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, డిఐజి సెంథిల్ కుమార్, ఎస్పీ రఘువీరారెడ్డిలు ప్రారంభించారు. మంత్రి బుగ్గన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో సమస్యలతో వచ్చిన బాధితుడికి ఫ్రెండ్లీగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సిబ్బందిని మంత్రి సత్కరించారు.



పోలీస్ స్టేషన్లో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

దేవస్థానానికి విరాళాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానానికి పలు రకాల విరాళములు సోమవారం నాడు దాతలు అందజేశారు. అన్నప్రసాద వితరణ పథకానికి తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డికి చెందిన మారేడుపల్లి నందీశ్వర్ రెడ్డి రూ.1,11,116 లను పర్యవేక్షకులు నాగరాజుకు, గో సంరక్షణ పథకానికి సికింద్రాబాద్‌కు చెందిన రాణి కన్స్ట్రక్షన్స్ గల్లా ఐదు లక్షల రూపాయలను ప్రజా సంబంధాల అధికారి శ్రీనివాసరావుకు, తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన పర్వతనేని వీవీఎస్ఎస్ శివరామకృష్ణ అన్నప్రసాద వితరణ పథకానికి.1,00, 116లను పర్యవేక్షకులు ఏ నాగరాజుకు, పశ్చిమ గోదావరి భీమ వరం చెందిన ఎ రామకృష్ణ అన్న ప్రసాద వితరణ పథకానికి.రూ 1,00,116లను పర్యవేక్షకులు బి. శ్రీనివాసులుకు, చెన్నైకి చెందిన ఎల్ రమేష్ రెడ్డి గో సంరక్షణ పథకంకు రూ.1,00,116లను పర్యవేక్షకులు ఏ నాగరాజుకు అందజేశారు. దాతలకు శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసినట్లుగా ఆలయ అధికారులు తెలిపారు.

బంగారం వెండి పుష్పములు బహుకరణ .. శ్రీశైల దేవస్థానానికి బంగారం వెండి పుష్పములు బహుకరించారు. సికింద్రాబాద్ కు చెందిన మురళి కుటుంబ సభ్యులతో కలిసి ముందుగా స్వామి అమ్మవారిని దర్శించుకుని ఆ తర్వాత బంగారం వెండి పుష్పములను వసతి విభాగం సహాయ కార్య నిర్వహణ అధికారి మోహన్ పర్యవేక్షకులు స్వాములులకు అందజేశారు. దాతలు మాట్లాడుతూ తామర పువ్వు డిజైన్ కలిగిన 82 గ్రాములు కలిగిన 8 బంగారు పుష్పాలు, 40 గ్రాముల కలిగిన 110 వెండి చిన్న పుష్పాలను కలిపి రూ.5.45 లక్ష ల తో తయారు చేయించినట్లుగా దాతలు తెలిపారు. ఈ విధంగా అందజేసిన దాతులను శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసినట్లుగా ఆలయ అధికారులు తెలిపారు.



దర్శనం అనంతరం బయటకు వస్తున్న దాతలు

దేవస్థానం వైద్యశాలకు మందులు, మిషన్ బహుకరణ

శ్రీశైలంలోని దేవస్థానం వైద్యశాలకు బయో కెమిస్ట్రీ అనలైజర్ మిషన్, పలు రకాల మందులను తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌కు చెందిన రాణి కన్స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత గల్లా గుండయ్య సోమవారం నాడు దేవస్థానం వసతి విభాగం సహాయకార్యనిర్వహణ అధికారి మోహన్, ప్రజా సంబంధాల అధికారి టి శ్రీనివాసరావులకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ.1,63,412 ఉంటుందని దాతలు తెలిపారు. ఈ విధంగా విరాళంలో అందజేసిన వారికి శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసినట్లుగా ఆలయ అధికారులు తెలిపారు. వీరితోపాటు దేవస్థానం ఆసుపత్రి డాక్టర్లు వైద్య సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న పిఒ రవీంద్రా రెడ్డి

ఎస్‌సి, ఎస్‌టి చట్టంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం ఏరియాలో ఉన్న గిరిజనులకు ఎస్‌సి, ఎస్‌టి చట్టంపై అవగాహన సదస్సు సోమవారం సున్నిపెంటలో వైటిసిలో ఎపి క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంటు కర్నూల్ వారి ఆధ్వర్యంలో ఐటిడిఎ అధికారి బి.రవీంద్ర రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిఎంఎస్ఆర్ఇజిఎస్ సిఐడి ఇన్‌ఛార్జి కెజి.నాయక్, ఇన్స్పెక్టర్ ప్రసాద్ రావు, సున్నిపెంట సి.గంగయ్య, స్టేట్ లెవెల్ ప్రాజెక్ట్ కమిటీ లీడర్ కుడుముల మూగెన్న హాజరయ్యారు. ఈ సందర్భగా పిఒ మాట్లాడుతూ శ్రీశైలం ఏరియాలోని గిరిజనులను, చెంచులను, విద్యార్థులకు వారి హక్కులను, వారి రక్షణకు ఉన్న ఎస్‌సి, ఎస్‌టి చట్టం 1989 గురించి, నేరం జరిగిన తర్వాత భాధితులకు ఉన్న హక్కులు, వారి సౌకర్యాలను వివరించినట్లు తెలిపారు. గిరిజనులు ఎస్‌సి, ఎస్‌టి చట్టం గురించి తెలుసుకుని సమాజంలో నిర్భయంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి బి.లక్ష్మినారాయణ, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ రావు, ఎస్ఐ ఉస్మాన్ ఘని, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి : డిఎస్‌పి

ఆత్మకూర్ : గిరిజన ప్రజలు, విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆత్మ కూరు డిఎస్పి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నాడు ఆత్మకూరు మండలం బైర్లుటి గూడెం నందు షెడ్యూల్ తెగల చట్టాలను గూర్చి గురించి అవగాహన సదస్సు, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్ స్కూల్ విద్యార్థులకు చెందిన విద్యార్థులు, గూడెం ప్రజలకు కర్నూల్ సిఐడి వారి ఆధ్వర్యములో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీనివాస రావు, ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగభూషణ్, కళాశాల ప్రిన్సిపాల్ కే. రేఖామణి, ప్రభుత్వ ఎస్టి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు యేసు యాదవ్, సర్పంచ్ శ్రీమతి గురువమ్మ మాట్లాడారు.కర్నూలు సిఐడి అధికారులు ఇన్స్పెక్టర్ నగేష్ బాబు, సబ్ ఇన్స్పెక్టర్ బందే సాహెబ్ సిబ్బంది పాల్గొన్నారు. సదస్సు అనంతరము గ్రామస్తులకు, విద్యార్థినులకు గిరిజనుల హక్కులు, చట్టాలకు సంబంచిన పుస్తకాలను పంపిణీ చేశారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డిఎస్పి శ్రీనివాసరావు

సెల్ టవర్ నిర్మిస్తే నిరాహార దీక్ష చేస్తాం

-కౌన్సిలర్, వార్డు ప్రజలు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని 2వ వార్డులో సెల్ టవర్ నిర్మించాలనుకుంటే నిరాహార దీక్షకు పూనుకుంటామని 2వ వార్డు కౌన్సిలర్ మొల్ల జాకీర్ హుస్సేన్, వార్డు ప్రజలు హెచ్చరించారు. పట్టణంలోని 2వ వార్డులో సోమవారం సెల్ టవర్ నిర్మా ణం జరిగే ప్రాంతం వద్ద వార్డు ప్రజలతో కలిసి మొల్ల జాకీర్ హుస్సేన్ సెల్ టవర్ నిర్మాణ పనులను అడ్డుకుని,కంపెనీ ప్రతినిధులతో మాట్లాడగా మా వద్ద ప్రభుత్వం ఇచ్చిన జీవో కాపీ ఉందని పొంతనలేని సమాధానం చెప్తున్నట్లు వారు ఆరోపించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు,కౌన్సిలర్ మొల్ల జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ 2వ వార్డులో సెల్ టవర్ నిర్మించబోతున్నారని తెలిసి గత డిసెంబర్ నెలలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సమస్యను ప్రస్తావించి వార్డులో సెల్ టవర్ నిర్మాణం వద్దని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లామని అన్నారు. వార్డు ప్రజలు వ్యతిరేకిస్తున్న సెల్ టవర్ నిర్మాణ పనులు చేపట్టడం ఏంటని మండిపడ్డారు. వార్డు ప్రజలు మన్సూర్, రసూల్, అలీ మాట్లాడుతూ రెండో వార్డులో చేపట్టబోయే సెల్ టవర్ నిర్మాణం వలన రేడి యేషన్ పెరిగి కాలనీలోని మహిళలు,వద్దులు,చిన్న పిల్లలు అనారోగ్యం బారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. టవర్ నిర్మించబోయే స్థలానికి దగ్గరలో బాలికల మదరసా ఉందని ఆ మదరసాలో దాదాపు 150 మంది విద్యార్థినులు చదువుతు న్నారని అన్నారు. వారు అనారోగ్యం పాలైతే ఎవరిది బాధ్యత అని ప్రశ్నించారు. ఇప్పుడున్న రేడియేషన్‌కు 5జీ టవర్ నిర్మిస్తే ప్రజలందరూ అనారోగ్యం బారిన పడతారని తెలిపారు. అనంతరం వార్డు ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పి.కిషోర్‌కు వినతిపత్రం అందించి సెల్ టవర్ నిర్మాణం చేపట్టకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు ప్రజలు, మహిళలు యువకులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ కు వినతిని పత్రం ఇస్తున్న వార్డు ప్రజలు

యోగా ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

- జవహర్ నాయక్

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఉమ్మడి కర్నూలు నంద్యాల జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో పనిచేసే యోగా ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే జీతాలు చెల్లించాలని గిరిజన ఉపాధ్యాయ సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షులు జవహర్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం నాడు ఆత్మకూరు పట్టణంలోని, అంబేద్కర్ భవన్‌లో జరిగిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్' ఆదాని హెల్త్ ఫౌండేషన్ ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారి అనుమతితో నియమింపబడిన యోగా ఉపాధ్యా యులకు ఒక సంవత్సర కాలం గడచినా జీతాలు ఇవ్వక పోవడం దారుణం, బాధాకరం అన్నారు. ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని రాజకీయ నాయకుల అండదండలతో దళారులు ఒక్కొక యోగా ఉపాధ్యాయుని దగ్గర రెండు, మూడు లక్షలు డబ్బులు వసూలు చేసుకొని మీకు ఒక నెలకు రూ.20 వేలు, రూ.30 వేలు ఇస్తామని నమ్మబలికి, బుద్ధ యోగ హెల్త్ ఫౌండేషన్ ద్వారా గుంటూరులో ఒక నెల ట్రైనింగ్ ఇప్పించి వివిధ పాఠశాలల్లో యోగా ఉపాధ్యాయులుగా నియమించారని,ఒక సంవత్సర కాలం గడచినా జీతాలు ఇవ్వక పోవడంతో,ఆర్థికంగా కుటుంబ పోషణ విద్యార్థుల చదువులు, ఆరోగ్య సమస్యలతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే వారికి జీతాలు చెల్లించాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా,రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కుమార్, నాగరాజు,శ్రీను, సుధాకర్ పాల్గొన్నారు.

అధ్వానంగా ఉన్న రోడ్డు



అధ్వాన్నంగా గ్రామీణ రోడ్లు

- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు
- అలసత్వం వహిస్తున్న అధికారులు
- వాహనదారులు, ప్రజలకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలో గ్రామీణ ప్రాంతాల రోడ్లు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. రహదారులు గుంతలమయం కావడంతో రాకపోకలకు ప్రజలకు ఇబ్బంది కలుగుతోంది. కలుగొట్లపల్లె నుంచి గొట్లూరు, గొట్లూరు నుంచి నేలంపాడు, గొడిగనూరు నుంచి కొత్తపల్లె, కొత్తపల్లె నుంచి డి.వనిపెంట, డి.వనిపెంట నుంచి ముత్యాలపాడు రహదారి గుంతలమయంగా మారింది. ఈ రహదారి వెంట వాహనదారులు, గ్రామస్థులు రాకపోకలు చేసేందుకు నరకయాతన పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోగా.. అధికారులు కూడా అలసత్వం వహిస్తున్నడంతో సామాన్య ప్రజానీకానికి, వాహనదారులకు అవస్తలు పడక తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. నాలుగేళ్లు గడుస్తున్న రహదారుల మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేలలో ఆదమరిస్తే ప్రమాదాలకు గురౌతున్నారు. వర్షం కురిస్తే రాకపోకలు చేసేందుకు రహదారులు సరిగా లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు,పాలకులు స్పందించి రహదారుల మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సౌదీలో చాగలమర్రి వాసి మృతి

ప్రజాశక్తి - చాగలమర్రి



చాంద్ బాషా (ఫైల్ ఫోటో)

చాగలమర్రిలోని జామియా మసీదు కాలనీకి చెందిన జంగాలపల్లె షరీఫ్ (డ్రైవర్ చాంద్ బాషా) సౌదీలో మృతి చెందాడు. పవిత్ర ఉమ్రా యాత్ర కోసం ఇటీవల గల్ఫ్ దేశానికి బయలుదేరాడు. సోమవారం గల్ఫ్ దేశంలో దిగిన అనంతరం తీవ్ర గుండెపోటుకు గురై అక్కడే మృతి చెందాడు. దీంతో చాగలమర్రిలో విషాద చాలు అనుకున్నాయి. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడు చాంద్ బాషా అంత్యక్రియలను సౌదీలోనే కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.



నాలుగో విడత ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

సంక్షేమాన్ని గమనించాలి : చైర్మన్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

గత ప్రభుత్వ హయాంలో ఉన్న పరిస్థితులు జగనన్న ప్రభుత్వంలో చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని గమనించాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అన్నారు. 4వ విడత "వైయస్ఆర్ ఆసరా" సంబరాలను మున్సిపాలిటీ పరిధిలోని 2, 3, 4, 5, 6, 7, 24,25 వార్డుల పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో కె.వి.ఆర్ గార్డెన్స్ నందు సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం కేక్ కటింగ్ చేసి సీఎం జగన్ చిత్రపటానికి చైర్మన్ , వైస్ చైర్ పర్సన్, కౌన్సిలర్ లు, వార్డు ఇంచార్జ్ లు మరియు పొదుపు మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ అర్షపోగు ప్రశాంతి, కౌన్సిలర్‌లు బోయ జయమ్మ, లాలు ప్రసాద్, వార్డు ఇంచార్జ్ లు ఆర్ట్ శ్రీను, సన అబ్దుల్లా, బోయ శేఖర్, మార్కెట్ రాజు మెప్మా టి.యం.సి శాంత కుమారి, సి.ఓ అర్చన, వినయ్, అర్పీలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.



'ఆడుదాం-ఆంధ్ర'లో సత్తా చాటిన మిడుతూరు మండల జట్లు

ప్రజాశక్తి - మిడుతూరు

నందికొట్కూరు నియోజకవర్గం స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్ర పోటీలలో మిడుతూరు మండల క్రీడాకారులు సత్తా చాటారు. 3 విభాగాల్లో విజయం సాధించారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ పోటీలలో గెలుపొందారు. నంద్యాలలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో ఈ జట్లు పాల్గొననున్నాయి. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీలు సుధీర్ నందకుమార్, వీరారెడ్డి, కళ్యాణ్ శింగ్, కేశవతి, అనురాధ,ఫరీద్, డిజిటల్ అసిస్టెంట్టులసి, సందీప్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

- వాహనాల తనిఖీలో ఎస్సై జి అశోక్

ప్రజాశక్తి - పాములపాడు

వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్ఐ జి అశోక్ సూచించారు. మండల కేంద్రంలో ఎస్సై జి అశోక్ వాహనాల తనిఖీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, రహదారి సూత్రాల పాటించి ప్రమాదాలు జరగకుండా సహకరించాలన్నారు. రోడ్డు పనులు జరుగుతున్న ఏరియాలో ఏర్పాటు చేసిన సూచన బోర్డులను అనుసరించి డ్రైవింగ్ చేయాలన్నారు. రానున్న ఎన్నికల సందర్భంగా గ్రామాలలో నాటు సారా, లిక్కర్ వంటి విక్రయాలు జరిపినట్లైతే కఠిన చర్యలు ఉంటాయన్నారు. చట్ట వ్యతిరేక చర్యల కు పాల్పడితే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మండల ప్రజలు తమ చుట్టుపక్కల ఏ సమస్యలు జరుగుతున్న తక్షణమే పోలీసు వారికి తెలియపర చాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీలు చేస్తున్న ఎస్ఐ

టిడిపి కార్యకర్తలు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని 11వ వార్డు విద్యానగర్ కాలనీవాసులు తెలుగుదేశం పార్టీకి చెందిన కార్పెంటర్ శాలు, కార్పెంటర్ బాషా,మాభు, రాజు, వలి,చిన్న రాజు,హుసేనలం, యూసుఫ్,మౌలానా దాదాపు 40 కుటుంబాలు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు, శాప్ చైర్మన్ బైరెడ్డిసిద్దార్థరెడ్డి అధ్యక్షతన వైసిపి నాయకులు రహంతుల్లా, అయుబ్‌ల అధ్వర్యంలో వైసిపిలో చేరారు. ఈ కార్య క్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు షేక్ మన్సూర్ అహ్మద్ నాయకులు పాల్గొన్నారు.



వైసిపి కండువా కప్పి ఆహ్వానిస్తున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి